సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
శనివారం । 11 । అక్టోబర్ । 2025



## రూ.50 వేల విరాళం

అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి కాజా రమేష్ కుమార్ (బెంగళూరు) శుక్రవారం రూ.50 వేలు విరాళం సమర్పించారు.



## అదివో.. అల్లదివో..

8లో

కోనసీమ తిరుమల క్షేత్రంగా పేరొందిన వాడపల్లిలో అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుని బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి.

## కదలిలోకి 4.21 లక్షల క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి శుక్రవారం 4,21,767 క్యూసెక్కుల గోదావరి మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. తూర్పు డెల్టాకు 4,400, మధ్య డెల్టాకు 2,300, పశ్చిమ డెల్టాకు 5 వేల క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద 10.20, భద్రాచలం వద్ద 26 అడుగులుగా నీటిమట్టాలు నమోదయ్యాయి.

## న్యూస్‌రీల్

### ధాన్యం సేకరణ పకడ్బందీగా చేపట్టాలి



ధాన్యం కొనుగోలుపై సమీక్షిస్తున్న జేసీ నిషాంతి

అమలాపురం రూరల్: ఖరీఫ్ ధాన్యం సేకరణ పకడ్బందీగా చేపట్టాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి ఆదేశించారు. అమలాపురంలోని కలెక్టరేట్‌లో బుధవారం సెంట్రల్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్, ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ప్రతినిధులు, పౌరసరఫరాల అధికారులు, మిల్లర్లతో సమావేశం నిర్వహించారు. ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం కొనుగోలు సన్నద్ధత, తీసుకోవాల్సిన అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో 4.40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడిగా రానుందని, స్థానిక అవసరాలకు పోగా మిగిలిన 3.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. జిల్లా వ్యాప్తంగా 85 లక్షల గోనె సంచులు సిద్ధం చేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా 151 రైస్‌మిల్లులు ఉన్నాయని, వీటి కెపాసిటీ ఆధారంగా లక్ష్యాలు నిర్దేశిస్తామన్నారు. జిల్లా పౌర సరఫరాల అధికారి ఎ.ఉదయభాస్కర్, జిల్లా పౌర సరఫరాల మేనేజర్ పి.శ్రీనివాసరావు, ఎఫ్‌సీఐ రీజినల్ మేనేజర్ గంగాధర్ పాల్గొన్నారు.ప్రభుత్వ ఆదేశాల మేరకు మూడో దశ భూముల రీ సర్వే నిర్దేశిత కాల వ్యవధిలో పూర్తి చేయాలని జేసీ నిషాంతి రెవెన్యూ, సర్వే సిబ్బందిని ఆదేశించారు. కలెక్టరేట్‌లో కొత్తపేట, రామచంద్రపురం రెవెన్యూ డివిజన్ల పరిధిలోని తహసీల్దార్లు, మండల సర్వేయర్లతో సమీక్ష జరిపారు. మూడో దశ రీసర్వే కార్యకలాపాలు ఈ నెల 3న ప్రారంభమయ్యాయని, రైతులు సద్వినియోగం చేసుకుని భావితరాలకు వివాద రహిత భూములను అందించాలని సూచించారు. ఆర్డీఓలు దేవరకొండ అఖిల, పి.శ్రీకర్ తదితరులు పాల్గొన్నారు.

### బోధనేతర పనుల బహిష్కరణ



కలెక్టరేట్‌లో ఈఓ విశ్వేశ్వరరావుకు వినతిపత్రం అందజేస్తున్న ఫ్యాప్టో జిల్లా ప్రతినిధులు

అమలాపురం టౌన్: బోధనేతర పనుల్లో భాగంగా ప్రధానంగా వివిధ రకాల సమాచారాన్ని సేకరించే యాప్‌లను శుక్రవారం నుంచి బహిష్కరించినట్లు ఫ్యాప్టో జిల్లా చైర్మన్ ఎంటీవీ సుబ్బారావు స్పష్టం చేశారు. రాష్ట్ర ఫ్యాప్టో పిలుపు మేరకు చేపట్టిన ఈ బహిష్కరణ సమాచారాన్ని జిల్లా కలెక్టర్, డీఈఓకు తెలిసేలా ఆ రెండు కార్యాలయాల్లో ఫ్యాప్టో జిల్లా ప్రతినిధులు వినతి పత్రాలు అందించారు. కలెక్టరేట్‌లో ఈఓ కె.విశ్వేశ్వరరావుకు, డీఈఓ డాక్టర్ షేక్ సలీమ్ బాషాలకు వేర్వేరుగా వినతి పత్రాలు ఇచ్చారు. ఇక నుంచి ఉపాధ్యాయులుగా తరగతి గదుల్లో అటెండెన్స్, విద్యా బోధన, మిడ్ డే మీల్స్ వంటి కార్యక్రమాలనే పర్యవేక్షిస్తారని స్పష్టం చేశారు. ఫ్యాప్టో జిల్లా ప్రధాన కార్యదర్శి పోతంశెట్టి దొరబాబు, కో చైర్మన్ సరిదే సత్య పల్లంరాజు, పెంకే సత్యనారాయణ, షబ్బీర్ హుస్సేన్, నాగిరెడ్డి శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# బీమా.. ఏమంటారో!

- రాయవరం ఘటనలో బాధితులకు కానరాని భరోసా
- ఇప్పటికీ పరిహారం ప్రకటించని కూటమి సర్కారు
- కార్మికులకు బీమా చేయించని బాణసంచా తయారీ యజమానులు



రాయవరంలో బుధవారం బాణసంచా తయారీ కేంద్రంలో జరిగిన ప్రమాదం

సాక్షి, అమలాపురం: బాణసంచా వెలుగులు చూసి ఆనందిస్తాం.. పిల్లా పాపలతో సందడి చేస్తాం.. అలాంటి మందుగుండు సామగ్రి తయారీ ప్రాణాలతో చెలగాటమని అందరికీ తెలిసిందే.. అయినా తమ కుటుంబాల కోసం ప్రాణాలను పణంగా పెట్టి బాణసంచా తయారీ పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులు, రోజు వారీ కూలీలు ఎందరో.. వారు చిన్న నిప్పు రేగినా క్షణాల్లో అశువులు బాస్తున్నారు. అలాంటి సందర్భాల్లో బాధిత కుటుంబాల పరిస్థితి అగమ్య గోచరంగా మారుతోంది.. సరిగ్గా అలానే రాయవరం బాణసంచా తయారీ కేంద్రంలోని పెను విస్ఫోటనంలో మృత్యువాత పడిన ఎనిమిది మంది కుటుంబ సభ్యుల పరిస్థితి ఉంది. అలాగే తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్న ఇద్దరూ అతి పేద కుటుంబాలకు చెందిన వారే. వీరికి కనీసం బీమా సౌకర్యం లేక, ప్రభుత్వం పరిహారం ఇవ్వక పెద్ద కష్టం వచ్చి పడింది.

రాయవరంలో శ్రీగణపతి గ్రాండ్ ఫైర్ వర్క్స్ బాణసంచా దుకాణంలో బుధవారం జరిగిన పేలుడులో ఎనిమిది మంది మృత్యువాత పడ్డారు. మరో ఇద్దరికి తీవ్ర గాయాలై మృత్యువుతో పోరాడుతున్నారు. వాస్తవంగా బాధిత కుటుంబాలకు ప్రభుత్వం ఇప్పటికే పరిహారం ప్రకటించాలి. ఇంత వరకూ ఏ ప్రకటనా రాలేదు. ఇటువంటి ప్రమాదాల్లో మరణించిన కార్మికులు, కూలీలకు కనీసం బీమా పరిహారమైనా వస్తోంది. వీరికి బీమా కూడా లేకపోవడంతో ఆ పరిహారం వచ్చే పరిస్థితి లేదు. వీరికే కాదు.. గతంలో జరిగిన బాణసంచా పేలుడు ఘటనలో మృతి చెందిన చాలా మందికి బీమా లేక బాధిత కుటుంబాలు ఇబ్బంది పడ్డాయి. అయితే 2019 అక్టోబర్‌లో పెద్దాపురం నియోజకవర్గం పరిధి సామర్లకోట మండలం వేట్లపాలెంలో జరిగిన బాణసంచా దుకాణం పేలుడులో మృతి చెందిన వారికి నాటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో భారీ పరిహారం అందింది. మొత్తం ఆరుగురు మృతి చెందగా, ఒక్కొక్కరికీ వివిధ రూపాల్లో రూ.15 లక్షల వరకూ పరిహారం వచ్చింది. పిఠాపురం నియోజకవర్గం పరిధిలో యు.కొత్తపల్లి మండలం వాకతిప్ప 2014లో జరిగిన ప్రమాదంలో 18 మంది మృతి చెందగా, రూ.మూడు లక్షల చొప్పున పరిహారం ఇచ్చారు. అది కూడా నాడు ప్రతిపక్ష నేత హోదాలో బాధితులను పరామర్శించేందుకు వచ్చిన వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డిమాండ్ చేయడంతో నాటి చంద్రబాబు ప్రభుత్వం తప్పదన్నట్టు పరిహారం ఇచ్చింది. అయితే చిన్న ప్రమాదాల్లో మృతి చెందిన వారికి మాత్రం పరిహారం అందడం లేదు. ముఖ్యంగా బీమా లేకపోవడమే కారణం. బీమా చేయించకపోవడానికి యాజమాన్యం, కార్మికుల అశ్రద్ధతోపాటు కార్మిక శాఖ తీరు కూడా కారణమవుతోంది.

**కారణాలు ఎన్నో..**

- రాయవరం ప్రమాదంలో చనిపోయిన ఎనిమిది మందికి బీమా లేదు. ఈ తయారీ కేంద్రంలో పని చేస్తున్న ఎనిమిది మందికి బీమా చేయించారని అధికారులు చెబుతున్నారు. అయితే చనిపోయిన వారికి మాత్రం బీమా లేదు. దీనితో వీరందకీ ప్రభుత్వం ఇచ్చే అరకొర పరిహారం, లేదా తయారీదారులు ఇచ్చే సాయమే దిక్కు. ఈ ప్రమాదంలో యజమాని సత్యనారాయణ మూర్తి కూడా మృతి చెందడంతో యాజమాన్యం నుంచి పరిహారం అందుతుందీ లేనిదీ చెప్పలేని పరిస్థితి.
- బాణసంచా తయారీ కేంద్రాల్లో తాత్కాలికంగా పనిచేస్తున్న కూలీలకు బీమా ఉండడం లేదు. వారికి బీమా చేయిస్తున్నదీ లేనిది చూడాల్సిన కార్మిక శాఖ పట్టించుకోవడం లేదు. తమకు ఇచ్చే కార్మికుల జాబితా కన్నా అధికంగా కూలీలను వినియోగిస్తున్నారని వారు చెబుతున్నారు. నిరంతరం నిఘా పెట్టేందుకు కార్మిక శాఖకు సిబ్బంది కొరత వేధిస్తుంది. ఇటువంటి ప్రమాదాలు జరిగినప్పుడు బీమా లేకుంటే యజమానుల నుంచి రికవరీ చేస్తామని అధికారులు చెబుతున్నారు.
- బీమా కల్పించడం కోసం కార్మికునిగా పేరు నమోదు చేయిస్తే అతను ఆ కంపెనీ, పరిశ్రమలో పనిచేసే ఉద్యోగిగా గుర్తించాల్సి వస్తోంది. అప్పుడు పని లేని సమయాల్లో కూడా జీతాలు ఇవ్వడం, ఇతర పీఎఫ్, ఈఎస్‌ఐ వంటి సౌకర్యాలు కల్పించాలి. అందుకే కార్మికులకు బీమా కల్పించడం లేదని తెలుస్తోంది.
- కార్మిక శాఖకు సిబ్బంది కొరత పట్టిపీడిస్తోంది. కోనసీమ జిల్లా పరిధిలో సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు, అటెండర్లు కూడా లేకుండా కార్యకలాపాలు చేయాల్సి వస్తోంది. దీనివల్ల పరిశ్రమలు, బాణసంచా తయారీ కేంద్రాలపై నిఘా పెట్టే పరిస్థితి లేకుండా పోయింది.



ప్రమాదంలో గాయపడిన వ్యక్తిని తరలిస్తున్న స్థానికులు (ఫైల్)

### ముందుగా డిపాజిట్ చేయించుకోవాలి

బాణసంచా తయారీ కేంద్రాల్లోనే కాదు.. పరిశ్రమలు, కంపెనీల్లో పనిచేసే కార్మికులకు బీమా చేయించకుంటే యాజమాన్యాల నుంచి నష్ట పరిహారం వసూలు చేస్తామని కార్మిక శాఖ చెబుతోంది. పేలుడు, అగ్నికి ఆహుతి కావడం వంటి ప్రమాదాలు జరిగినప్పుడు యాజమాన్యాలు కూడా నష్టపోతున్నాయి. రాయవరం ప్రమాదంలో యజమాని కూడా మృతి చెందడంతోపాటు బాణసంచా తయారీ కేంద్రం బూడిదైంది. అటువంటప్పుడు వారి నుంచి పరిహారం రికవరీ ఎలా చేస్తారనే దానికి అధికారుల వద్ద సమాధానం లేదు. అందుకే ప్రమాదాలు జరిగే అవకాశమున్న సంస్థలు, వ్యాపార కేంద్రాలు, యాజమాన్యాల వద్ద నుంచి కార్మిక శాఖ ముందుగా కొంత మొత్తం డిపాజిట్ చేయించుకోవాలని కార్మిక సంఘాలు కోరుతున్నాయి.

### కార్మికుల నమోదు జరగక..

రాయవరంలో బాణసంచా పేలుడు ఘటన మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో జరిగితే రాత్రి ఏడు గంటల వరకూ అక్కడకక్కడే చనిపోయిన ఆరో వ్యక్తిని గుర్తించలేకపోయారు. బాణసంచా తయారీ కేంద్రాల్లో పనిచేస్తున్న కార్మికులు, రోజువారీ కూలీల వివరాలను నమోదు చేయడం లేదు. తయారీ కేంద్రాలు, పరిశ్రమల వద్ద కనీసం బోర్డులు ఏర్పాటు చేసి రోజూ పనికి వస్తున్న వారి వివరాలు నమోదు చేయాలని కార్మిక సంఘాలు కోరుతున్నా పట్టించుకునేవారు లేకుండా పోయారు.

### బాణసంచా తయారీ కేంద్రాల్లో నిబంధనలు తప్పనిసరి

ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్



కొత్తపేటలోని బాణసంచా తయారీ కేంద్రంలో యంత్రాలను పరిశీలిస్తున్న ఐజీ అశోక్‌కుమార్

కొత్తపేట: బాణసంచా తయారీ కేంద్రాల్లో నిబంధనలు కచ్చితంగా పాటించాలని ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ సూచించారు. ఈ నెల 8న రాయవరం బాణసంచా తయారీ కేంద్రంలో భారీ విస్ఫోటనం సంభవించి ఎనిమిది మంది మృత్యువాత పడిన నేపథ్యంలో పోలీస్ యంత్రాంగం అప్రమత్తమైంది. ఇందులో భాగంగా ఎక్కడికక్కడే బాణసంచా తయారీ కేంద్రాలను తనిఖీ చేస్తుంది. ప్రమాదాల నివారణలో భాగంగా ఐజీ అశోక్‌కుమార్ శుక్రవారం జిల్లా ఎస్పీ రాహుల్ మీనాతో కలసి జిల్లాలోని పలు బాణసంచా తయారీ కేంద్రాలను తనిఖీ చేశారు. బాణసంచా తయారీ విధానం, యంత్రాల వినియోగం, కార్మికుల భద్రత, అగ్ని ప్రమాదాల నివారణ, కార్మికులకు బీమా తదితర అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో ఐజీ మాట్లాడుతూ రాయవరం ప్రమాదం నేపథ్యంలో ఏలూరు రేంజ్ పరిధిలో జిల్లాల్లోని అన్ని బాణసంచా కేంద్రాల్లో జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రాణ నష్టం లేకుండా వెంటనే స్పందించేందుకు తగు చర్యలు తీసుకునేలా పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. తక్షణ వినియోగానికి ఇసుక బస్తాలు, నీరు తొట్టెలు, అగ్నిమాపక పరికరాలు సిద్ధంగా ఉంచాలన్నారు. బాణసంచా విక్రయాలు ప్రభుత్వం ఇచ్చిన తాత్కాలిక లైసెన్స్ ఆధారంగా సురక్షితమైన, బహిరంగ ప్రదేశాల్లో మాత్రమే జరగాలన్నారు. ప్రమాదం సంభవించిన వెంటనే 112 నంబరుకు కాల్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. దీపావళిని ప్రజలంతా సంతోషంగా, సురక్షితంగా జరుపుకోవడం పోలీసు శాఖ ప్రధాన ఆకాంక్ష అని అన్నారు. ఈ తనిఖీల్లో కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీమోహన్, రావులపాలెం రూరల్, అమలాపురం టౌన్ సీఐలు సీహెచ్ విద్యాసాగర్, వీరబాబు, ఎస్బీ సీఐ పుల్లారావు, కొత్తపేట, రాయవరం ఎస్సైలు జి.సురేంద్ర, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# కదలిరండి.. కోటి సంతకాల ఉద్యమానికి..

- వైద్య కళాశాలల ప్రైవేటీకరణను అడ్డుకుందాం
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి, ఎమ్మెల్సీలు, నియోజకవర్గాల కో ఆర్డినేటర్లు



వైఎస్సార్ సీపీ కోటి సంతకాల ప్రజా ఉద్యమం పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి, ఎమ్మెల్సీలు, కో ఆర్డినేటర్లు తదితరులు



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి

అమలాపురం రూరల్: రాష్ట్రంలో గత ప్రభుత్వం ప్రారంభించిన 17 ప్రభుత్వ వైద్య కళాశాలలను కూటమి సర్కారు ప్రైవేటీకరించడాన్ని వ్యతిరేకిస్తూ వైఎస్సార్ సీపీ కోటి సంతకాల సేకరణ ప్రజా ఉద్యమం చేపట్టిందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి వెల్లడించారు. మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు శుక్రవారం నుంచి జిల్లాలో వైద్య కళాశాలల ప్రైవేటీకరణ వ్యతిరేక ఉద్యమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. అమలాపురం మండలం భట్నవిల్లిలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ పినిపే శ్రీకాంత్ గృహంలో ఉద్యమ కార్యాచరణపై జిల్లాలోని ఎమ్మెల్సీలు, పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్లు, ముఖ్య నాయకులతో జగ్గిరెడ్డి సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ జిల్లాలో 45 రోజుల పాటు ప్రజా ఉద్యమం జరుగుతుందన్నారు. ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణపై ప్రజా ఉద్యమం చేసి సమస్యను రాష్ట్ర గవర్నర్ దృష్టికి తీసుకు వెళ్తామని తెలిపారు. 22వ తేదీ వరకూ జిల్లాలో రచ్చబండ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. దీనికి సంబంధించి శనివారం నియోజకవర్గాల్లో పోస్టర్ల ఆవిష్కరణతో పాటు నిరసన కార్యమాలు చేస్తామని, ఈ నెల 28న ఏడు నియోజకవర్గ కేంద్రాల్లో ర్యాలీలు, నవంబర్ 12న కోనసీమ జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీ చేపట్టి అధికారులకు వినతిపత్రాలు అందిస్తామని జగ్గిరెడ్డి వివరించారు. ఈ నెల 23న మేధావి వర్గాలు, ప్రజా సంఘాలు, వివిధ రాజకీయ పార్టీలతో సంతకాల సేకరణ చేసి, జిల్లాకు ర్యాలీగా సంతకాల ప్రతులను తీసుకు వస్తామన్నారు. ఇప్పటికే ఐదు వైద్య కళాశాలలను సీఎం చంద్రబాబు తన అనుచరులకు పీపీపీ విధానంలో ఇచ్చేస్తున్నారని అన్నారు. కళాశాలల భూములను తాకట్టు పెట్టి వారు డబ్బు తెచ్చుకుంటారన్నారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు మాట్లాడుతూ 17 వైద్య కళాశాలలు, బోధనాసుపత్రుల నిర్మాణాలకు మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పనులు ప్రారంభించారని, వీటిని పూర్తి చేయడానికి చంద్రబాబు వెనుకంజ వేస్తున్నారన్నారు. మాజీ సీఎం జగన్ అన్ని సదుపాయాలు సమకూర్చినా చంద్రబాబు అడుగు ముందుకు వేయడం లేదన్నారు. వందేళ్లలో రాష్ట్రంలో కేవలం 12 వైద్య కళాశాలలే ఉన్నాయని, గత వైఎస్సార్ సీపీ ఐదేళ్ల పాలనలో కొత్తగా 17 కళాశాలలకు శ్రీకారం చుట్టిందన్నారు. అనంతరం కోటి సంతకాల సేకరణ ప్రజా ఉద్యమం పోస్టర్లను జగ్గిరెడ్డి, ఎమ్మెల్సీలు, కోఆర్డినేటర్లు, నాయకులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణరావు, బొమ్మి ఇజ్రాయిల్, పార్టీ నియోజకవర్గ కో ఆర్డినేటర్లు గొల్లపల్లి సూర్యారావు, పొన్నాడ వెంకట సతీష్‌కుమార్, డాక్టర్ పినిపే శ్రీకాంత్, పిల్లి సూర్యప్రకాష్, గన్నవరపు శ్రీనివాసరావు, సీఈసీ సభ్యులు చింతా అనురాధ, పాముల రాజేశ్వరీదేవి, పితాని బాలకృష్ణ, పీకే రావు, రాష్ట్ర కార్యదర్శులు కర్రి పాపారాయుడు, పాటి శివకుమార్, చింతపాటి శ్రీనివాసరాజు, రాష్ట్ర రైతు విభాగం అధ్యక్షుడు జిన్నూరి రామారావు, స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు కుడుపూడి వెంకటేశ్వరబాబు, కుడుపూడి భరత్ భూషణ్, సాకా మణికుమారి, నేలపూడి స్టాలిన్ బాబు, కాశి మునికుమారి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వాసంశెట్టి తాతాజీ, జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులు గొల్లపల్లి డేవిడ్‌రాజు, మట్టపర్తి నాగేంద్ర, పట్టణ అధ్యక్షుడు సంసాని నాని, గుత్తుల చిరంజీవిరావు తదితరులు పాల్గొన్నారు.

### విజ్ఞాపన మహాసభను విజయవంతం చేయండి



రాష్ట్ర ఫ్యాప్టో చైర్మన్ సాయిప్రసాద్‌ను ఆహ్వానిస్తున్న ఎంటీఎస్ ఉపాధ్యాయ సంఘ జిల్లా ప్రతినిధులు

అమలాపురం టౌన్: ఏపీ డీఎస్సీ – 98 మినిమమ్ టైమ్ స్కేల్ (ఎంటీఎస్) ఉపాధ్యాయులు విజయవాడలో ధర్నాచౌక్ వద్ద శనివారం ఉదయం 10 గంటలకు నిర్వహించే విజ్ఞాపన మహా ధర్నాకు జిల్లా నుంచి ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా ఎంటీఎస్ ఉపాధ్యాయ సంఘ అధ్యక్షుడు సీహెచ్ కేశవకుమార్ విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాలకు చెందిన 4,072 మంది ఎంటీఎస్ ఉపాధ్యాయులు ఈ విజ్ఞాపన మహా సభలో పాల్గొనున్నారని అన్నారు. తమకు చెందిన ఐదు ప్రధాన డిమాండ్ల పరిష్కారంపై కూటమి ప్రభుత్వం చేస్తున్న తాత్సారానికి నిరసనగా సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 1998 ఎంటీఎస్ ఉపాధ్యాయులను వెంటనే రెగ్యులర్ చేయాలనేది తమ ప్రధాన డిమాండ్ అని గుర్తు చేశారు. వీరికి 55 ఏళ్ల పైబడి ఉండడంతో రిటైర్మెంట్‌కు దగ్గరగా ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు నెలకు రూ.25 వేల పెన్షన్ సౌకర్యం కల్పించాలని, హెల్త్ కార్డులు ఇప్పించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే ఈ విజ్ఞాపన మహాసభకు రాష్ట్రంలోని ఉపాధ్యాయ సంఘాల రాష్ట్ర ప్రతినిధులను, ఉపాధ్యాయ ఎమ్మెల్సీలను ఆహ్వానించామన్నారు. ఇందులో భాగంగానే పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో ఫ్యాప్టో రాష్ట్ర చైర్మన్, ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు లంకలపల్లి సాయిప్రసాద్‌ను ఆయన ఇంటికి ఎంటీఎస్ ఉపాధ్యాయులు బృందంగా వెళ్లి ఆహ్వానించామని కేశవకుమార్ తెలిపారు.

### డిసెంబర్ 3న రిలయన్స్ క్విజ్ పోటీలు

అమలాపురం రూరల్: విద్యార్థినీ విద్యార్థుల్లో ప్రతిభను ప్రదర్శించేందుకు రిలయన్స్ ధీరూబాయ్ అంబానీ క్విజ్ పోటీలు చక్కని వేదికగా నిలుస్తాయని రిలయన్స్ సీఎస్ఆర్ హెడ్ పి.సుబ్రహ్మణ్యం శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో ఈ క్విజ్‌లు నిర్వహిస్తామన్నారు. డిసెంబర్ 3న అమలాపురం అంబేడ్కర్ భవన్ వద్ద ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో 8, 9, 10 తరగతి చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులకు పోటీలు ఉంటాయన్నారు. నవంబర్ 30 లోగా కాకినాడలోని తమ కార్యాలయ పనిదినాల్లో పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 0884 3577222, 63022 23156 ఫోన్ నంబర్లలో సంప్రదించాలన్నారు.

## అన్నవరం దేవస్థానానికి రూ.30 లక్షలతో బస్సు

అన్నవరం: సత్యదేవుని దేవస్థానానికి స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) రూ.30 లక్షల విలువైన 32 సీట్లు కలిగిన బస్సును సమకూర్చింది. ఈ బస్సు తాళాలను ఎస్‌బీఐ చైర్మన్ చల్లా శ్రీనివాసులుశెట్టి దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ వీర్ల సుబ్బారావుకు శుక్రవారం అందజేశారు. గతంలో కూడా ఎస్‌బీఐ రెండు బ్యాటరీ కార్లు, ఒక బస్సును దేవస్థానానికి అందజేసింది. కార్యక్ర మంలో ఎస్‌బీఐ అమరావతి సర్కిల్ సీజీఎం రాజేష్‌కుమార్ పటేల్, జనరల్ మేనేజర్ హేమంత్ కుమార్, డీజీఎం పంకజ్ కుమార్ (రాజమహేంద్రవరం), సర్కిల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ పంకజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



బస్సు తాళాలను దేవస్థానం చైర్మన్ రోహిత్‌కు అందిస్తున్న ఎస్‌బీఐ చైర్మన్ శ్రీనివాసులుశెట్టి

## పెన్షన్ వేలిడేషన్ చట్టం రద్దు చేయాలి

రాజమహేంద్రవరం సిటీ: పెన్షన్ వేలిడేషన్ చట్టాన్ని తక్షణం రద్దు చేయాలని, వెంటనే 8వ కేంద్ర పే కమిషన్ ఏర్పాటు చేయాలని ఫోరం ఆఫ్ సివిల్ పెన్షనర్స్ అసోసియేషన్స్ చైర్మన్ డి.తిరుపతిరావు డిమాండ్ చేశారు. రాజమహేంద్రవరం సంచార భవన్ ఎదుట పెన్షనర్లు శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఆల్ సెంట్రల్ గవర్నమెంట్ పెన్షనర్స్ ఆధ్వర్యాన నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు పెన్షనర్లు పాల్గొని పెన్షన్ వేలిడేషన్ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో కన్వీనర్లు కె.భాస్కరరావు, కేవీఎస్ రాజు, పోస్టల్, టెలికమ్యూనికేషన్స్ (బీఎస్ఎన్ఎల్) పెన్షనర్లు పాల్గొన్నారు.




ధర్నా చేస్తున్న కేంద్ర ప్రభుత్వ పెన్షనర్లు

## రత్నగిరి మెయిన్ క్యాంటీన్ వద్ద మినీ క్యాంటీన్

అన్నవరం: రత్నగిరిపై ఈఓ కార్యాలయం దిగువన మెయిన్ క్యాంటీన్ వద్ద మినీ క్యాంటీన్ ఏర్పాటు చేయనున్నారు. దీని కోసం శుక్రవారం నిర్వహించిన టెండర్ కం బహిరంగ వేలంలో నెలకు రూ.1.80 లక్షలకు పాలక మండలి శుక్రవారం రాత్రి పాట ఖరారు చేసింది. ఈ మినీ క్యాంటీన్ దక్కించుకున్న పాటదారు కార్తిక మాసం నుంచి ఇక్కడ కాఫీ, టీ, ఫలహారాలు, స్నాక్స్, కూల్‌డ్రింక్స్, వాటర్ బాటిల్స్ విక్రయించాల్సి ఉంటుంది. భోజనాలు పెట్టేందుకు, వివాహాది శుభకార్యాలకు భోజనాలు అడ్వాన్స్‌గా బుక్ చేసేందుకు అవకాశం లేదని దేవస్థానం పేర్కొంది. దేవస్థానం వ్యవస్థాపక ధర్మకర్త ఐవీ రోహిత్, ఈఓ వీర్ల సుబ్బారావు, ఇతర అధికారులతో సమావేశమై పాలక మండలి తరఫున పలు తీర్మానాలు చేశారు.

**ఇతర తీర్మానాలు**

- దేవస్థానం విశ్రాంత వేద పండితుడు, త్రివేది కపిలవాయి రామశాస్త్రి సోమయాజులును ప్రత్యేక వైదిక సలహాదారుగా, దైవజ్ఞ బ్రహ్మ తంగిరాల వేంకట పూర్ణప్రసాద్ సిద్ధాంతిని దేవస్థానం సిద్ధాంతిగా నియమించారు.
- సర్క్యులర్ మండపంలో వెదురుతో చేసిన రోలింగ్ మ్యాట్లు వేలాడదీయడానికి 1,230 అడుగులకు రూ.61,500తో కొనుగోలు చేయాలి.
- స్మార్త ఆగమ పాఠశాల వసతి గృహాల్లో రూ.6 లక్షలతో మీడియం డెన్సిటీ ఫైబర్ బోర్డు కొనుగోలుకు ఆమోదం.



ట్రస్ట్ బోర్డు సమావేశంలో వివిధ అంశాలపై చర్చిస్తున్న దేవస్థానం చైర్మన్ రోహిత్

- సత్యదేవుని గిరి ప్రదక్షిణలో భక్తులకు పంపిణీ చేయడానికి టెండర్ ద్వారా 70 పైసలకు వాటర్ ప్యాకెట్, రూ.6.70కు వాటర్ బాటిల్ కొనుగోలుకు తీర్మానం.
- ప్రకాష్ సదన్‌లో పాడైన విద్యుత్ స్విచ్ బోర్డులు, స్విచ్‌ల స్థానంలో కొత్తవి ఏర్పాటుకు పిలిచిన టెండర్ రూ.4.72 లక్షలకు ఆమోదం.
- సత్యదేవుని తెప్పోత్సవం రోజున విద్యుద్దీపాలంకరణ టెండర్‌కు రూ.6.14 లక్షలతో ఆమోదం.
- తెప్పోత్సవం ఏర్పాట్లకు దత్తత ఆలయాలైన తొండంగి ఉమా రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో రూ.90 వేలు, కోరుకొండ దేవస్థానంలో రూ.1.40 లక్షలు ఖర్చు చేయాలి.
- దేవస్థానం టోల్‌గేట్‌లో కార్లు, తదితర వాహనాల టోల్ వసూలుకు గాను నిర్వహించిన టెండర్ కం బహిరంగ వేలం నెలకు రూ.18,88,888కు ఖరారైంది.

## 'నన్నయ'లో 14 నుంచి ఫుడ్ ఫెస్టివల్



బ్రోచర్ విడుదల చేస్తున్న వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ తదితరులు

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీ ప్రాంగణంలో మూడు రోజుల పాటు జరిగే మెగా ఫుడ్ ఫెస్టివల్ ఈ నెల 14న ప్రారంభమవుతుందని వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ తెలిపారు. దీనికి సంబంధించిన బ్రోచర్‌ను ఆమె శుక్రవారం విడుదల చేశారు. అక్టోబరు 16 ప్రపంచ ఆహార దినోత్సవాన్ని పురస్కరించుకుని, గోదావరి రుచులు, అభిరుచులను తెలియజేయాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపడుతున్నామని వివరించారు. ఆహార పదార్థాల తయారీలో చేయి తిరిగిన ఔత్సాహికులు ఈ కార్యక్రమంలో పాల్గొని, ప్రతిభ చాటాలన్నారు. వివరాలకు 8639 550 186 నంబర్‌కు ఫోన్ చేయవచ్చన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య కేవీ స్వామి, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.విజయనిర్మల, హెచ్ఓడీ ఆచార్య డి.కల్యాణి, అధ్యాపకులు ఎంఎం కృష్ణవేణి, కె.సింధుజ పాల్గొన్నారు.

# అదివో.. అల్లదివో..

- వాడపల్లిలో ఆధ్యాత్మిక పరిమళాలు
- బ్రహ్మాండ నాయకునికి బ్రహ్మోత్సవాలు ప్రారంభం
- తొలిరోజు పరావాసుదేవ అలంకరణలో స్వామివారు



వాడపల్లి మాడ వీధుల్లో శేష వాహనంపై ఊరేగుతున్న శ్రీవారు



వాడపల్లిలో స్వామివారికి పూజలు చేస్తున్న ఆలయ ఈఓ చక్రధరరావు దంపతులు, పండితులు



స్వర్ణాభరణాల అలంకరణతో స్వామి, అమ్మవార్లు

**కొత్తపేట:** కోనసీమ వెంకన్నగా.. ఏడు వారాల స్వామిగా.. పూజలందుకుంటున్న బ్రహ్మాండ నాయకుని బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి.. ఆత్రేయపురం మండలం వాడపల్లిలో స్వయంభువుగా వేంచేసిన శ్రీ, భూ సమేత వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు ఆశ్వయుజ బహుళ చవితి శుక్రవారం ఆరంభమయ్యాయి. తొలిరోజు ఆ స్వామిని చూసిన భక్తజనం మురిసిపోయింది. రాష్ట్రం నలు మూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామిని కొలిచారు. శేష వాహనంపై శ్రీవారి విహార ఘట్టం కన్నుల వైకుంఠంగా సాగింది. గోవింద నామస్మరణతో వాడపల్లి క్షేత్రం మార్మోగింది. ఆలయ ప్రాంగణం, మాడ వీధులు రంగు రంగుల పూలమాలలు, విద్యుత్ అలంకరణలతో కనువిందు చేసింది. దేవదాయ – ధర్మదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, దేవస్థానం ఈఓ నల్లం సూర్యచక్రధరరావు ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకుడు ఖండవిల్లి ఆదిత్య అనంత శ్రీనివాస్, అర్చక బృందం, వివిధ ప్రాంతాల నుంచి వేద పండితులు ఉదయం నుంచి రాత్రి వరకూ నిరంతరాయంగా స్వామివారికి విశేష పూజలు, అభిషేకాలు, హోమాలు, వాహన సేవ, ఊరేగింపు తదితర కార్యక్రమాలు నిర్వహించడంతో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది. తెల్లవారు జామునే సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి, అనంతరం తీర్థ బిందెలతో గోదావరి జలాలను తీసుకువచ్చి అభిషేకించారు. గోత్ర నామాలతో పూజలు చేశారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం 9.35 గంటల నుంచి స్వామివారికి స్వస్తి వచనం, పుణ్యాహ వాచనం, దీక్షాధారణ, అగ్నిప్రతిష్ఠాపన, విశేషార్చన, తీర్థప్రసాద గోష్ఠి నిర్వహించారు. సాయంత్రం 4 గంటల నుంచి మృత్యుంగ్రహణ, శాలా విహరణ, అంకురార్పణ, వాస్తుపూజ, వాస్తుహోమం, ధ్వజారోహణ, బలిహరణ, నీరాజన మంత్రపుష్పం తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. దేవస్థానం తరఫున ఈఓ చక్రధరరావు దంపతులు స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు.

**శేషవాహనంపై శ్రీవారి విహారం**

బ్రహ్మోత్సవాలు ప్రారంభ వేళ స్వామివారు పరావాసుదేవగా భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి 7.30 గంటలకు శేషవాహనంపై స్వామివారిని అలంకరించగా, మాడ వీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా పండితులు శేష వాహనంపై శ్రీవారు విహార ఘట్టం విశిష్టతను వివరించారు. వైకుంఠంలో శ్రీమన్నారాయణ స్వామి శేష పాన్పుపై ఉంటారని తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో ప్రథమ వాహనం శేష వాహనం అని, ఈ వాహనంపై స్వామివారిని దర్శిస్తే వైకుంఠంలో శ్రీమన్నారాయణుని దర్శించిన ఫలితం లభిస్తుందని వివరించారు. ఆ విధంగా స్వామివారిని దర్శించిన భక్తులు ఆనంద డోలికల్లో తేలియాడారు. తొలిరోజు కార్యక్రమాల్లో ఏలూరు రేంజ్ డీఐజీ అశోక్‌కుమార్, జిల్లా ఎస్పీ రాహుల్ మీనా పాల్గొని స్వామివారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా వారిని ఈఓ చక్రధరరావు సత్కరించి, స్వామివారి చిత్రపటాలను అందజేశారు. పలువురు ప్రముఖులు, నాయకులు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్ విద్యాసాగర్ ఆధ్వర్యంలో ఎస్సై రాము పోలీసు బందోబస్తు నిర్వహించారు.

### నేటి కార్యక్రమాలు ఇలా..

వెంకన్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజు శనివారం బ్రహ్మోత్సవాల నిత్య పూజలు, హోమాలు, అభిషేకాలతో పాటు ఉదయం మహా పుష్పయాగం నిర్వహిస్తారు. సాయంత్రం సహస్ర దీపాలంకరణ సేవ, రాత్రి సరస్వతి అలంకరణతో హంస వాహనసేవ ఉంటుంది.

### అంబాజీపేట కొబ్బరి మార్కెట్



| కొబ్బరి రకం | ధర (రూ.ల్లో) |
|---|---|
| కొత్త కొబ్బరి (క్వింటాల్) | 20,000 – 21,500 |
| కొత్త కొబ్బరి (రెండో రకం) | 10,500 – 12,000 |
| **కురిడీ కొబ్బరి (పాతవి)** | |
| గండేరా (వెయ్యి) | 31,500 |
| గటగట (వెయ్యి) | 30,000 |
| **కురిడీ కొబ్బరి (కొత్తవి)** | |
| గండేరా (వెయ్యి) | 30,000 |
| గటగట (వెయ్యి) | 28,500 |
| **నీటికాయ** | |
| పాత (ముక్కుడు)కాయ (వెయ్యి) | 23,000 – 24,000 |
| కొత్త (పచ్చి)కాయ (వెయ్యి) | 23,000 – 24,000 |
| కొబ్బరి నూనె (15 కిలోలు) | 5,250 |
| కిలో | 350 |

## పీపీపీ విధానాన్ని వ్యతిరేకిస్తూ నిరసన



అంతర్వేది మినీ ఫిషింగ్ హార్బర్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న మత్స్యకారులు

**సఖినేటిపల్లి:** అంతర్వేది మినీ ఫిషింగ్ హార్బర్ నిర్వహణలో పీపీపీ విధానాన్ని వ్యతిరేకిస్తూ శుక్రవారం హార్బర్‌లో స్థానిక మత్స్యకారులు నిరసన వ్యక్తం చేశారు. హార్బర్ నిర్వహణ ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడం వల్ల తమ జీవనోపాధి దెబ్బతింటుందని, దీనిని తక్షణం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా స్థానికుడు వనమాలి శ్రీనివాసరావు మాట్లాడుతూ సుమారు 40 ఏళ్లుగా ఇక్కడ జీవిస్తున్నామని, ఎటువంటి సమాచారం ఇవ్వకుండా హార్బర్ నిర్వహణను పీపీపీ పద్ధతిలో టెండర్ ప్రక్రియ చేపట్టి కాంట్రాక్టర్‌కు అప్పగించాలని ప్రభుత్వం చూస్తుందన్నారు. హార్బర్ నిర్మాణానికి ఫిషర్‌మెన్ ఫీల్డ్ లేబర్ కోఆపరేటివ్ సొసైటీ భూమి 20 ఎకరాలు ఇచ్చామని, గ్రామస్తులతో పాటు వేర్వేరు ప్రాంతాలకు చెందిన వారంతా కలసి ఇక్కడ మంచి వాతావరణంలో వేట కొనసాగిస్తున్నట్టు తెలిపారు. స్థానికేతరులు వేట విరామం సమయంలో స్వగ్రామాలకు వెళ్లి, అనంతరం తిరిగి వచ్చి తమతో పాటు ఉంటారని అన్నారు. కాగా పీపీపీ పద్ధతిలో కొంత మంది తమకు కావాల్సిన వారిని జీతాలకు పెట్టుకుని, తమను బయటకు గెంటేసే పద్ధతిలో ఉన్నారని, మత్స్య సంపదను ఇక్కడ అమ్మడానికి వీల్లేదంటూ అప్పుడే ఒత్తిళ్లు తెస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేటు వ్యక్తుల నిర్వహణ వల్ల తమ బతుకు తెరువుకు ఇబ్బందిగా మారనుందని, తమకు పూర్తి న్యాయం చేసే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. గ్రామస్తుడు పొన్నాల జయకృష్ణ మాట్లాడుతూ గ్రామస్తుల జీవనోపాధి మెరుగుపర్చేందుకు హార్బర్‌కు స్థలం ఇచ్చామని, గ్రామంలో ఎవరినీ సంప్రదించకుండా మధ్యస్థంగా పీపీపీ పద్ధతిలో టెండర్ ప్రక్రియకు చర్యలు తీసుకోవడం తగదని అన్నారు. పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

## భారీగా బాణసంచా స్వాధీనం



బోడసకుర్రులో పోలీసులు స్వాధీనం చేసుకున్న బాణసంచా

**అల్లవరం:** బోడసకుర్రు పోస్టాఫీస్ సమీపంలో నిల్వ ఉంచిన మందుగుండు సామగ్రిని అల్లవరం పోలీసులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. ముందస్తు సమాచారం మేరకు ఎస్సై సంపత్‌కుమార్ ఆధ్వర్యంలో అల్లవరం పోలీసులు దాడి చేసి బాణసంచాను గుర్తించారు. బోడసకుర్రు పోస్టాఫీస్‌ను ఆనుకుని కిరాణా వ్యాపారం చేస్తున్న జక్కా కామేశ్వరరావు ఇంటి వెనుక బాత్‌రూమ్‌లో నిల్వ చేసిన బాణసంచాను సీఐ ప్రశాంత్‌కుమార్, తహసీల్దార్ వీవీఎల్ నరసింహారావు సమక్షంలో మూటలుగా కట్టి ట్రాక్టర్‌లోకి లోడ్ చేసి నిశిద్ధ ప్రదేశానికి తరలించారు. ఈ బాణసంచా విలువ రూ.1.94 లక్షలు ఉంటుందని సీఐ ప్రశాంత్‌కుమార్ తెలిపారు. అనుమతులు లేకుండా బాణసంచా నిల్వ చేసినా, తరలించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు.

## వైద్య కళాశాలల ప్రైవేటీకరణ దుర్మార్గం

- ప్రభుత్వ తీరును నిరసిస్తూ కోటి సంతకాల సేకరణ ఉద్యమం
- వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర జిల్లాల రీజినల్ కో ఆర్డినేటర్ కన్నబాబు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి కురసాల కన్నబాబు

**కాకినాడ రూరల్:** బృహత్తర బాధ్యతగా, తరతరాలకు ఉపయోగపడేలా రాష్ట్రంలో 17 వైద్య కళాశాలలు, బోధనాస్పత్రు ల నిర్మాణాన్ని గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభిస్తే.. నేడు చంద్రబాబు ప్రభుత్వం వాటిని ప్రైవేటు కు అప్పగించాలని నిర్ణయించడం దుర్మార్గమైన చర్యని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర జిల్లాల రీజినల్ కో ఆర్డినేటర్ కురసాల కన్నబాబు అన్నారు. కాకినాడ వైద్య నగర్‌లోని తన నివాసంలో శుక్రవారం సాయంత్రం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి 12 మెడికల్ కాలేజీలుంటే జగన్‌మోహన్‌రెడ్డి 17 కాలేజీల నిర్మాణానికి సంకల్పించారన్నారు. వీటిల్లో 5 కళాశాలల్లో అడ్మిషన్లు ప్రారంభించగా, మరో రెండు అడ్మిషన్లకు సిద్ధంగా, 10 కళాశాలు నిర్మాణంలో ఉన్నాయని చెప్పా రు. ఈలోగా ప్రభుత్వం మారడంతో కార్పొరేట్ల పక్షాన నిలిచే చంద్రబాబు వీటిని ప్రైవేటుకు అప్పగించాలని నిర్ణయించారన్నారు. ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ పేదల పక్షాన నిలిచే జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిపక్ష నేతగా ముందుకు వెళ్తున్నారన్నా రు. ఇందులో భాగంగా ఉద్యమ నిర్మాణం చేపడుతూ, కోటి సంతకాల సేకరణకు పిలుపునిచ్చారని చెప్పారు.

**జగన్ పర్యటనకు ప్రభం'జనం' :** పోలీసుల ద్వారా ప్రభుత్వం ఎన్ని ఆంక్షలు పెట్టినా నర్సీపట్నం వద్ద మెడికల్ కాలేజీ సందర్శనకు గురువారం వచ్చిన వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పర్యటనకు ప్రభంజనాన్ని తలపించేలా అన్ని వర్గాల ప్రజలూ తరలివచ్చారని కన్నబాబు అన్నారు. వారందరికీ ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. జగన్ పర్యటనలో దారి పొడవునా ప్రజల నుంచి వచ్చిన వినతులు చూస్తే ప్రభుత్వంపై వ్యతిరేకత స్పష్టంగా కనిపిస్తోందన్నారు. స్టీల్‌ప్లాంటును దశల వారీగా మూసివేసే కార్యక్రమం చేపడుతున్నారని, బల్క్ డ్రగ్ ఫ్యాక్టరీలు వద్దంటూ మత్స్యకారులు నిరసనలు తెలియజేస్తుంటే అణచివేయాలని చూస్తున్నారని అన్నారు. చోడవరం సుగర్ ఫ్యాక్టరీ రైతులు నిరసన తెలియజేస్తున్నారన్నారు. కేజీహెచ్‌లో 65 మంది గిరిజన విద్యార్థులు కామెర్లతో చికిత్స పొందుతున్నారని, పార్వతీపురం ఆస్పత్రిలో 80 మంది.. ఇలా 600 మంది గిరిజన గురుకుల పాఠశాలల విద్యార్థుల్లో 200 మంది వరకూ అనారోగ్యంతో ఆస్పత్రి పాలవ్వడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. మల మూత్రాలు కలసిన నీరు తాగాల్సిన పరిస్థితి హాస్టల్ విద్యార్థులకు ఉందంటే ఎవరు తలదించుకోవాలని చంద్రబాబును కన్నబాబు ప్రశ్నించారు.

**ప్రైవేట్‌కు దోచిపెట్టేందుకే.. :** నర్సీపట్నంలో 52 ఎకరాల భూమిని కేటాయించి వైద్య కళాశాల కడుతూంటే ప్రైవేటుకు ఇవ్వాలని ఎలా అనుకుంటున్నారని, పాడేరులో మెడికల్ కాలేజీ కట్టాలనే ఆలోచన 15 ఏళ్లు సీఎంగా ఉన్న చంద్రబాబుకు ఎందుకు రాలేదని కన్నబాబు నిలదీశారు. ప్రైవేటుకు దోచిపెట్టే కార్యక్రమం తప్ప చంద్రబాబు చేసిందేముందన్నారు. మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరించే ఆలోచనను వెనక్కి తీసుకోవాలన్నారు. కేజీహెచ్ వద్ద జగన్ పట్ల విశాఖ పోలీస్ కమిషనర్ అనుచితంగా మాట్లాడినట్టు జర్నలిస్టులు చెప్పారని, ఇది సముచితమేనా అని ప్రశ్నించారు. జగన్ పులివెందుల ఎమ్మెల్యే మాత్రమే కాదని, మాజీ సీఎం అని, 2029లో కాబోయే సీఎం అనే విషయం గుర్తు పెట్టుకోవాలని అధికారులకు సూచించారు. ఎవరిని సంతోషపెట్టడానికి అధికారులు పని చేస్తున్నారని కన్నబాబు ప్రశ్నించారు.



## అగ్ని ప్రమాద బాధిత కుటుంబాలను ఆదుకోవాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ప్రజా సంఘాల నాయకులు

**రామచంద్రపురం:** రాయవరంలో శ్రీగణపతి ఫైర్ వర్క్స్ కేంద్రంలో సంభవించిన అగ్ని ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలకు ప్రభుత్వం రూ. 50 లక్షల చొప్పున పరిహారం ప్రకటించి, ఆదుకోవాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం స్థానికంగా జరిగిన విలేకరుల సమావేశంలో ఐఎఫ్‌టీయూ ఉమ్మడి జిల్లా కార్యదర్శి చీకట్ల వెంకటేశ్వరరావు, పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.సిద్ధూ, ఏఐకేఎంఎస్ జిల్లా నాయకుడు వెంటపల్లి భీమశంకరం తదితరులు మాట్లాడారు. ఆ ఫైర్ వర్క్స్‌లో సుమారు 50 మంది కార్మికులు పనిచేస్తుండగా, ఆ రోజు 30 మంది మాత్రమే వచ్చారని, భోజన విరామ సమయంలో ప్రమాదం సంభవించడంతో మరణాల సంఖ్య కొంత తగ్గిందన్నారు. అయినప్పటికీ, నీటి వనరులు అందుబాటులో లేకపోవడం, అగ్నిమాపక చర్యల్లో నిర్లక్ష్యం కారణంగా ప్రమాదం తీవ్రరూపం దాల్చిందన్నారు. ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా రెవెన్యూ, అగ్నిమాపక, పరిశ్రమల, కార్మిక శాఖలు నిరంతర పర్యవేక్షణ చేయాలన్నారు. రాష్ట్ర హోం శాఖ మంత్రి అనిత సంఘటన స్థలాన్ని సందర్శించినా ఇప్పటి వరకూ ఎటువంటి నష్ట పరిహారం ప్రకటించకపోవడం విచారకరమన్నారు. క్షతగాత్రులకు రూ.10 లక్షల చొప్పున ఆర్థిక సహాయం ఇవ్వాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాయవరం మండలంలోని అన్ని ఫైర్ వర్క్స్ యూనిట్లను తక్షణం తనిఖీ చేసి, భద్రతా ప్రమాణాలపై సమీక్ష చేపట్టాలని అధికారులను కోరారు.

### ఇంటర్ పరీక్ష ఫీజుకు గడువు పెంపు



ఓరియంటేషన్ ప్రోగ్రామ్‌లో మాట్లాడుతున్న డీఐఈఓ సోమశేఖరరావు

**అమలాపురం టౌన్:** ఇంటర్ పరీక్ష ఫీజు చెల్లింపునకు ముందుగా ప్రకటించిన ఈ నెల 10వ తేదీ కాకుండా, ఆ గడువును ఈ నెల 22 వరకూ ఇంటర్మీడియెట్ విద్యా మండలి పెంచిందని డీఐఈఓ వనుము సోమశేఖరరావు తెలిపారు. ఈ విషయాన్ని అమలాపురంలో శుక్రవారం ఆయన తెలిపారు. గడవు తర్వాత ఈ నెల 30వ తేదీ వరకూ రూ.వెయ్యి అపరాధ రుసుంతో ఫీజు చెల్లించే అవకాశం ఉందన్నారు.

**మ్యాథమెటిక్స్ ఓరియంటేషన్ ప్రోగ్రామ్ :** అమలాపురం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఇంటర్ విద్యలో ప్రవేశపెట్టిన సంస్కరణల నిమిత్తం మ్యాథమెటిక్స్ ఓరియంటేషన్ ప్రోగ్రామ్ జరిగింది. జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల అధ్యాపకులు పాల్గొని బోధనా అంశాలపై చర్చించారు. డీఐఈఓ సోమశేఖర రావు హాజరై అధ్యాపకులకు పలు అంశాలు వివరించారు.

## శిక్షణ ముగిసింది.. చేరికే మిగిలింది

- కొత్త గురువులకు ఇండక్షన్ ట్రైనింగ్ పూర్తి
- 13న కొలువుల్లో చేరనున్న టీచర్లు



శిక్షణకు హాజరైన ఉపాధ్యాయులు

**రాయవరం:** వారంతా ఎంతో శ్రమించారు.. పుస్తకాలతో కుస్తీ పట్టారు.. చివరికి కొలువులు సాధించారు.. తల్లిదండ్రుల కష్టాన్ని చూసి కొందరు.. గురువుల ప్రోత్సాహంతో ఇంకొందరు.. అన్నదమ్ముల ఆదర్శంతో మరికొందరు.. పుట్టిల్లు, మెట్టింటి వారి సహకారంతో.. ఇలా ఒక్కొక్కరిది ఒక్కో గాథ.. పట్టుదలతో చదివి డీఎస్సీలో విజయం సాధించారు. కొత్తగా కొలువు సాధించిన ఉపాధ్యాయులకు ఇండక్షన్ ట్రైనింగ్ కూడా పూర్తయ్యింది. ఇక కొలువుల్లో చేరడమే తరువాయి. డీఎస్సీ–2025లోఎంపికై న నూతన ఉపాధ్యాయులకు ఈ నెల 3వ తేదీ నుంచి శిక్షణ ఇచ్చారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఏడు వెన్యూస్‌లో ఆయా సబ్జెక్టుల వారీగా ఇచ్చిన శిక్షణ శుక్రవారంతో ముగిసింది. ఇందులో భాగంగా వృత్తిలో పెంపొందించుకోవాల్సిన నైపుణ్యాలను వివరించారు. విద్యాశాఖ ప్రవేశపెట్టిన విధి విధానాలు, కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. నిపుణ్ భారత్ లక్ష్యాలు, విద్యా, బాలల హక్కులు, పాఠ్య ప్రణాళికలు తయారు చేయడం, మూల్యాంకన విధానాలు, లీప్ యాప్, డిజిటల్ టూల్స్, ఐఎఫ్‌పీలను ఉపయోగించడం, టెక్నాలజీ ద్వారా కొత్త బోధన విధానాలను పరిచయం చేయడం, వృత్తి నైపుణ్యం, నియమాలు పాటించడం, విద్యార్థులకు ఆదర్శంగా నిలవడం తదితర అంశాలపై ఎనిమిది రోజుల శిక్షణ ఇచ్చారు.

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో..**

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో 1,668 మంది ట్రైనింగ్ పొందాల్సి ఉండగా, 1,659 మంది హాజరయ్యారు. వివిధ కారణాలతో తొమ్మిది మంది హాజరు కాలేదు. సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు 524 మందికి 524, సోషల్ సబ్జెక్టు 131 మందికి 130 మంది, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్లు 210 మందికి 210, తెలుగు, హిందీ, ఇంగ్లిష్ సబ్జెక్టులకు సంబంధించి 230 మందికి 227 మంది, గణితం, ఫిజికల్ సైన్స్, బయలాజికల్ సైన్స్ సబ్జెక్టుల నుంచి 244 మందికి 244 మంది, పోస్ట్ గ్రాడ్యుయేషన్ టీచర్లు 329 మందికి 324 మంది హాజరయ్యారు.

**బదిలీ ఉపాధ్యాయులకు మోక్షం**

అనేక పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం అందరికీ తెలిసిందే. ముఖ్యంగా బదిలీ అయిన ఉపాధ్యాయుల్లో పలువురు కోరుకున్న స్థానాల్లో నేటికీ చేరలేదు. ఉపాధ్యాయుల కొరత ఉండడంతో బదిలీ జరిగిన ఉపాధ్యాయులనే వెనక్కి పంపించిన అధికారులు పాఠశాలల నిర్వహణ సాగిస్తున్నారు. కొత్త ఉపాధ్యాయుల చేరికతో బదిలీ అయ్యి రిలీవ్ కాలేని ఉపాధ్యాయుల సమస్యకు పరిష్కారం లభించనుంది.

### సమర్థవంతంగా శిక్షణ



డీఎస్సీ–2025 ఉపాధ్యాయులకు నిర్వహించిన ఇండక్షన్ ట్రైనింగ్‌ను సమర్థవంతంగా నిర్వహించాం. ఎక్కడా ఏ విధమైన లోటుపాట్లకు తావులేకుండా శిక్షణ ఇచ్చాం. నూతన ఉపాధ్యాయులు క్రమశిక్షణతో శిక్షణ తీసుకున్నారు.

–డాక్టర్ షేక్ సలీం బాషా, డీఈఓ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా

### వెబ్ ఆప్షన్లు పూర్తి



కొత్తగా ఎంపికై న ఉపాధ్యాయులకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వెబ్ ఆప్షన్ల నమోదు పూర్తయ్యింది. పోస్టింగ్ ఆర్డర్లు జనరేట్ అయిన తర్వాత ఈ నెల 13న విధుల్లో చేరా ల్సి ఉంటుంది. అందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నాం.

–జి.నాగమణి, ఆర్జేడీ, పాఠశాల విద్యాశాఖ, కాకినాడ

### నేడు పోస్టింగ్ ఆర్డర్లు

శిక్షణలో భాగంగా గురు, శుక్రవారాల్లో ఉపాధ్యాయులు వెబ్ ఆప్షన్లకు అవకాశం కల్పించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మేనేజ్‌మెంట్ల వారీగా ఖాళీలను ప్రకటించారు. వెబ్ లింక్ ద్వారా ఉపాధ్యాయులు వారికి కావాల్సిన పోస్టులను ఎంపిక చేసుకున్నారు.

శనివారం ఉపాధ్యాయులకు వారు ఎంచుకున్న స్థానాలను కేటాయిస్తూ పోస్టింగ్ ఆర్డర్లు జనరేట్ అయ్యే అవకాశముంది. వారికి కేటాయించిన స్థానాల ప్రకారం ఈ నెల 13న ఉపాధ్యాయ కొలువుల్లో చేరనున్నారు.